క్లుప్తంగా

ఆర్టీసీ బస్సులపై మండిపడుతున్న ప్రజలు

పుంగనూరు: స్థానిక డిపో నుంచి స్పెషల్ బస్సులను నడపకపోవడంతో ప్రజలు అధికారులపై మండిపడుతున్నారు. పుంగనూరు నుంచి నిత్యం వందలాది మంది బెంగళూరు, తిరుపతి, హైదరాబాద్, నెల్లూరు, చెన్నై ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే పట్టణంలోని వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు బెంగళూరు, చెన్నైలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో బెంగళూరు , చెన్నై నుంచి పండుగ స్పెషల్‌కు బస్సులు నడపకపోవడంతో ఓవర్‌లోడుతో అవస్థల నడుమ శని, ఆదివారాల్లో పుంగనూరుకు చేరుకున్నారు. రిజర్వేషన్లు పది రోజుల మునుపే పూర్తయినా పండుగ వేళ అదనపు బస్సులు నడపకుండా ఒకే సర్వీసు నడుపుతూ పరోక్షంగా ప్రైవేటు బస్సుల కలెక్షన్లకు దోహదం చేస్తున్నారని విమర్శలకు తావిచ్చింది. రాబోవు పండుగ రోజుల్లో అయినా ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా ప్రత్యేక బస్సులు నడపాలని కోరుతున్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం


కమ్మనపల్లెలో గర్భవతులతో మాట్లాడుతున్న సీడీపీఓ మాధవీలత

బైరెడ్డిపల్లె: గర్భం దాల్చిన మహిళలు లింగ నిర్ధారణ పరీక్షలు చేసుకోవడం చట్టరీత్యా నేరమని సీడీపీఓ మాధవీలత అన్నారు. కమ్మనపల్లె సచివాలయ పరిధిలోని గ్రామాల్లో సోమవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, గర్భవతులు పోషక విలువలతో కూడిన తాజా కూరగాయలు బాగా తినాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూజర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ టీచర్లు శకుంతల, భాగ్యమ్మ, మగ్బూల్, విజయకుమారి పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం


కంటి వైద్య పరీక్షలు చేస్తున్న నిపుణుడు

పలమనేరు: స్థానిక ప్రభుత్వ విశ్రాంత పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అగర్వాల్ కంటి ఆస్పత్రి వైద్యులు సోమవారం వారి సంఘ కార్యాలయంలో ఉచిత కంటి పరీక్షలను నిర్వహించారు. 80మందిని పరీక్షించి అవసరమైన వారికి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. మరోవైపు స్థానిక ప్రైవేట్ బ్యాంకు మేనేజర్లు సీనియర్ సివిల్ సిటిజన్లకు బ్యాంకుల్లోని సౌకర్యాలను వివరించారు. అసోసియేషన్ అధ్యక్షులు రత్నారెడ్డి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గోతులతో ప్రమాదం


సీతమ్మగుట్ట, రైస్ మిల్లు సమీపంలో..

సదుం: మండలంలో పుంగనూరు–తిరుపతి ప్రధాన రహదారిపై గోతులు ప్రమాదాలకు తావిచ్చేలా ఉంటున్నాయి. గొంగివారిపల్లె పంచాయతీ రైస్ మిల్లు సమీపంలోని రెండు ప్రాంతాలలో, సీతమ్మ గుట్ట సమీపంలో రోడ్డుపై గోతులు ఏర్పడ్డాయి. వాహనదారులు అదమరిస్తే ఆస్పత్రి పాలయ్యే పరిస్థితి ఉంటోంది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గోతులను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బై..బై.. గణేశా..!


వీ.కోట: నిమజ్జన ఊరేగింపులో జెడ్పీ చైర్మన్, అఖిలపక్ష నాయకులు


బైరెడ్డిపల్లె: కొత్తయిండ్లులో వినాయకున్ని నిమజ్జనం చేస్తున్న యువకులు. (ఇన్‌సెట్) వీ.కోటలో..

పెద్దపంజాణి: మండలంలోని పలు గ్రామాలలో కొలువుదీరిన వినాయక విగ్రహాలను సోమవారం కోలాహలంగా నిమజ్జనం చేశారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేక పూజల అనంతరం వినాయక విగ్రహాలను ట్రాక్టర్లపై కొలువుదీర్చి, మేళ తాళాలతో పెద్ద ఎత్తున బాణసంచా పేల్చుతూ, ఊరేగింపుగా తీసుకెళ్లి సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. యువకులు, చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. పలు గ్రామాల్లో మండపాల వద్ద అన్నదానం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందో బస్తు నిర్వహించారు.

బైరెడ్డిపల్లె: వినాయక చవితి పండుగ పురస్కరించుకుని గ్రామాల్లో మూడు రోజులు పూజలందుకున్న వినాయక విగ్రహాలను సోమవారం ప్రత్యేక పూజార్చనల అనంతరం నిమజ్జనానికి తరలించారు. నాయక విగ్రహాలను ట్రాక్టర్లలో కొలువుదీర్చి, గ్రామ వీధుల గుండా యువకులు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా ఊరేగించారు. శెట్టిపల్లెలో బంక మట్టి మధ్యలో ఓ పొడుగాటి ఉట్లమాను ఏర్పాటు చేసి, దానికి ఆయిల్ బాగా పూశారు. యువకులు దానిని ఎక్కే ప్రయత్నంలో జారి పడుతుండటానికి తోడు, మరోవైపు నీళ్ల చల్లుతుంటే అసలు పట్టు దొరక్క ఉట్లమాను ఎక్కేందుకు నానా పీట్లు చేశారు. చివరకు గ్రామానికి చెందిన రాజశేఖర్ సాహసం చేసి పైకి ఎగబడి బహుమతి దక్కించుకున్నాడు.

వీ.కోటలో..

వి.కోట: పట్టణంలో సోమవారం ఘనంగా వినాయక నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో దాదాపు 20 చోట్ల ఏర్పాటు చేసిన వినాయస్వామి ప్రతిమలను కోలాటాలు, డీజే డ్యాన్సులు, మేళతాళాలు, యువత కేరింతల నడుమ నిమజ్జనానికి తరలించారు. అలాగే, సీఐ సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు, సిబ్బంది ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా వాహనాలను వేరే మార్గాల్లో మళ్లించారు. నిమజ్జన ఊరేగింపులో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, అఖిలపక్ష నాయకులు, ముస్లింలు సైతం పాల్గొని భక్తిభావాన్ని చాటుకున్నారు. పత్రపల్లె చెరువు వద్ద నిమజ్జనం నిమిత్తం జేసీబీలు, క్రేన్లు, చెరువు కట్టపై తాత్కాలిక లైట్లు, గజ ఈతగాళ్లను సైతం పంచాయతీ సర్పంచ్ పీఎస్ లక్ష్మి ఆధ్వర్యంలో పకడ్బందీగా ఏర్పాటు చేశారు. పట్టణంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తూ యువత కోలాహలం నడుమ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు నిమజ్జన కార్యక్రమాన్ని పరిశీలించారు.

పుంగనూరులో..

పుంగనూరు: వినాయక చవితి పండుగ పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలను సోమవారం బ్యాండు మేళం, మంగళవాయిద్యాలు, బాణసంచా మోత, యువత కేరింతల నడుమ కోలాహలంగా నిమజ్జనం చేశారు. సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు నిమజ్జన కార్యక్రమాలకు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. పట్టణంలోని కొత్తయిండ్లు, పోలీస్‌లైన్ ప్రాంతాలలో వినాయకుడి విగ్రహాలను ఉత్సవ కమిటీ సభ్యులు ఊరేగించారు. అలాగే మండలంలోని బండ్లపల్లెలో వినాయకుడి లడ్డూకు వేలం వేయగా రూ.81 వేలకు విక్రయించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.


బైరెడ్డిపల్లె: శెట్టిపల్లెలో ఉట్లమాను సందడి




పెద్దపంజాణి: రాయలపేటలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు, బైరెడ్డిపల్లె: గంగినాయనపల్లెలో గణనాథుని నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు   పుంగనూరులో..

విద్యాగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు


స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

పలమనేరు: మండలంలో కొలమాసనపల్లెలోని ప్రసన్న విద్యా గణపతి ఆలయంలో సోమవారం స్వామి వారికి కుంభాభిషేకం నిర్వహించారు. సోమవారం ఆలయం వద్ద పూర్ణాహుతి, గ్రామంలో మహిళలతో కలశాల ఊరేగింపు చేశారు. ఆలయం వద్ద భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అర్చకులు శ్రీనివాసమూర్తి, పట్టాభిరామమూర్తి, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

కోరం లేక మండల సమావేశం నేడు

గుడుపల్లె: మండల సర్వ సభ్య సమావేశానికి సభ్యుల కోరం లేక వాయిదా వేశారు. సోమవారం ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. మండలంలోని గుడుపల్లె, ఓయన్ కొత్తూరుకు సంబంధించిన ఎంపీటీసీలు మాత్రమే వచ్చారు. మొత్తం 13 మంది సభ్యులకు గాను ముగ్గురు మాత్రమే రావడం, మధ్యాహ్నం వరకు వేచిచూసినా ఎవరూ రాకపోవడంతో సమావేశాన్ని మంగళవారానికి వాయిదా వేసినట్లు ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ తెలిపారు. సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

రాయితీపై ఉలవలు పంపిణీ


ఉలవలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మురళీరెడ్డి

సదుం: రాయితీ ఉలవ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని తిమ్మానాయనపల్లె సర్పంచ్ మురళీ రెడ్డి కోరారు. సోమవారం స్థానిక రైతు సేవా కేంద్రం లో సబ్సిడీపై ఉలవలు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. వేరుశనగ సాగు చేయని రైతులు ఉలవలను సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విజయవాడ వరదకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

- వాతావరణశాఖ హెచ్చరికలను సైతం ప్రభుత్వం పట్టించుకోలేదు
- ముందుగా అప్రమత్తం చేసి ఉంటే ఇంత నష్టం జరిగేది కాదు
- కరకట్టవద్ద చంద్రబాబు ఇల్లు మునగకుండా ఉండేందుకే ఇంతటి ఘోరం
- మృతుల కుటుంబాలకు ఎవరు బాధ్యత వహిస్తారు?
- పలమనేరు మాజీ ఎమ్మెల్యే ఎన్ వెంకటేగౌడ



పలమనేరు: విజయవాడ వరదలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని పలమనేరు మాజీ ఎమ్మెల్యే ఎన్ వెంకటేగౌడ విమర్శించారు. విజయవాడ వరదలు, ఆపై ప్రాణనష్టంపై సోమవారం ఆయన మాట్లాడుతూ....భారీ వర్షాలు, వరదలు వస్తాయని నాలుగైదు రోజుల ముందే తెలిసినా ప్రజలను ఎందుకు అప్రమత్తం చేయలేదని, కనీసం సురక్షిత ప్రాంతాలకు ఎందుకు పంపలేదని ప్రశ్నించారు. కరకట్ట వద్దనున్న చంద్రబాబు ఇలు వరదనీటిలో మునగకుండా ఉండేందుకు చేసిన ప్రయత్నం కారణంగానే విజయవాడలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు వరద ధాటికి సర్వస్వం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ పవర్‌ప్లాంట్ కాపాడాలనే ఉద్దేశంతో బుడమేరు నుంచి నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడలోకి వదిలేశారన్నారు. దీంతో వరద విషయం తెలియని ప్రజలు ముందుస్తు రక్షణ చర్యలు తీసుకోలేదన్నారు. ఫలితంగా 50మందికి పైగా ప్రాణాలను కోల్పోవాల్సి వచ్చిందని, దీనికి చంద్రబాబే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తన ఇల్లు మునుగుతుందనే భయంతో విజయవాడ కలెక్టరేట్ ఉంటూ, తాను ప్రజల కోసమేనంటూ ఇక్కడ ఉన్నానంటూ డ్రామా రక్తి కట్టించారని అపహాస్యం చేశారు. వరదల విషయంలో కూటమి ప్రభుత్వం బాగా స్పందించిందని సీఎం ఎన్ని ప్రెస్‌మీట్లు పెట్టి చెప్పి నమ్మించేందుకు యత్నించినా అక్కడి ప్రజలే నమ్మడం లేదన్నారు. ఇప్పటికీ అక్కడి బాధితులకు నిత్యావసరాలందక ఇక్కట్లు పడుతూనే ఉన్నారన్నారు. చేసింది తప్పు అని తెలిసినా సీఎం చంద్రబాబు అక్కడ అధికారులను వెంటేసుకుని వరదనీటిలో బోట్లపై వెళుతూ ఎన్నికల ప్రచారాన్ని తలపించేలా మీడియాకు ఫోజులిచ్చారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం చేసిన తప్పును సరిదిద్దుకోవాలని హితవు పలికారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు శ్రేయస్కరం

రొంపిచెర్ల: గర్భవతులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ వినయ్ కోరారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భవతులు, బాలింతలకు ఉచిత వైద్య పరీక్షలు చేసి ఆయన మాట్లాడారు. శిశు మరణాల నివారణకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు చేసుకోవాలన్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని, అలాగే తాజా ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు, కోడిగుడ్లు, ఎండు ఖర్జూరం, ద్రాక్ష, బాదం పాలు తీసుకోవాలన్నారు. వీటి వలన ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిస్తారన్నారు. ప్రసవానంతరం శిశువుకు వెంటనే ముర్రుపాలు పట్టించాలని, దీని వలన వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.


గర్భవతులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్

'అంబేడ్కర్ విగ్రహ స్థలాన్ని మార్చరాదు'


ఎస్‌ఐకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సదుం: మండలంలోని కలకటవారిపల్లెలో ఉన్న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మరొక చోట ఏర్పాటు చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, దీనిని అడ్డుకోవాలని కోరుతూ సోమవారం మాల మహానాడు నాయకులు ఎస్‌ఐ షేక్‌షా వలి, తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. గతంలో విగ్రహాన్ని తొలగించేందుకు ప్రయత్నించారని, విగ్రహానికి ఎలాంటి ముప్పు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శనం, చంద్రయ్య, లక్ష్మయ్య, అశోక్, శ్రీరాములు, శ్రీనివాసులు, శివయ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

పుంగనూరు: మున్సిపాలిటి పరిధిలో అక్రమ నిర్మాణాలు, అక్రమ లేఔట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమ వారం ఆయన టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ అధికారులతో సమావేశం నిర్వహించారు. అన్ని వార్డులలోను సచివాలయ కార్యదర్శులు అక్రమ కట్టడాలను గుర్తించి, వాటికి అపరాధ రుసుంతో పన్నులు విధించాలని ఆదేశించారు. అలాగే ఆస్తిపన్ను, నీటి పన్ను సకాలంలో వసూలు చేయాలన్నారు. అక్రమ లేఔట్లపై ప్రభుత్వాదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి లేని లేఔట్లకు ఎలాంటి మౌలిక వసతులు కల్పించేది లేదన్నారు. మున్సిపల్ ఆదాయానికి గండికొడుతూ, రియల్‌ఎస్టేట్ వ్యాపారాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో ఆర్‌వో సతీష్‌కమలాకర్, జ్ఞానప్రకాష్, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఏ కష్టమొచ్చినా.. అండగా ఉంటాం


సింగిల్‌విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, పార్టీనేతలతో మాట్లాడుతున్న తంబళ్లపల్లె ఎమ్మెల్యే

- తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

చౌడేపల్లె: ఏ కష్టమొచ్చినా ..తాము అండగా ఉంటామని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి కార్యకర్తలకు, నేతలకు భరోసా ఇచ్చారు. చౌడేపల్లెలోని సింగిల్‌విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి ఇంట ఇటీవల మృతిచెందిన శోభ చిత్రపటానికి సోమవారం పూలమాల వేసి ఆయన నివాళులర్పించారు. రవిచంద్రారెడ్డి కుటుంబీకులను పరామర్శించారు. శోభ మృతి తీరనిలోటని, ఆమెకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.అనంతరం కార్యకర్తలు, నేతలను ఆత్మీయంగా పలకరించారు. ఎవరూ అధైర్య పడరాదని ధైర్యం చెప్పారు. గ్రామస్థాయి నుంచి పార్టీ నేతలు ఐకమత్యంతో ఉంటూ ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో నేతలు పద్మనాభరెడ్డి, నాగభూషణరెడ్డి, ఓబుల్‌రెడ్డి, వెంకటరమణ, చెంగారెడ్డి, శంకర్‌రెడ్డి, గణేష్ ,రవి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్య శిశువుకు జన్మ

బైరెడ్డిపల్లె: గర్భవతులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం బాగా తీసుకోవడంతోపాటు ఆరోగ్య సూత్రాలు పాటిస్తే ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిస్తారని వైద్యాధికారి విజయ్‌చంద్ర అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం మహతి ఫౌండేషన్ సహకారంతో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు పౌష్టికాహారం పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. నెలలు నిండిన తర్వాత ప్రభుత్వాసుపత్రిల్లో కాన్పులు చేసుకోవాలని కోరారు. తల్లిపాల ప్రాముఖ్యత, వ్యాధి నిరోధక టీకాల విశిష్టత, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహతి ఫౌండేషన్ నిర్వాహకులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


గర్భవతులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న వైద్యాధికారి, ఫౌండేషన్ నిర్వాహకులు

ఉలవ సాగుకు తరుణమిదే..!

- 80 శాతం రాయితీతో విత్తనాల పంపిణీ
- తక్కువ పెట్టుబడి మూడు నెలల్లోనే దిగుబడి
- రైతుకు అదనపు ఆదాయం, పశువులకు మేత
- వేరుశనగ సాగుచేయని రైతులకు ఉలవ ప్రత్యామ్నాయం


వ్యవసాయశాఖ రైతులకు పంపిణీ చేస్తున్న ఉలవ విత్తనాలు

పలమనేరు: పంటసాగుకు పెట్టుబడులు లేక, విత్తనాలున్నా అదును లేక ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేయలేని రైతులకు ఉలవ సాగు ప్రత్యామ్నాయంగా మారింది. వ్యవసాయశాఖ అధికారులు ఉలవలను 80 శాతం సబ్సిడీతో పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో రైతులకు పంపిణీ చేస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో మొదటి పంట తర్వాత వర్షాధారంగా లేదా ఏవైనా పంటలు వేయడానికి అనువుగా లేనప్పుడు ఉలవ సాగు రైతులకెంతో మేలు. ఖరీఫ్‌లో వేరుశనగ, నువ్వులు, గోగు తర్వాత ఏక పంటగానూ రాగి, జొన్న పంటల్లో సహ పంటగానూ ఉలవలు సాగుచేయవచ్చు. పంట వడుపుకున్నాక పశువులకు మంచి ఎండుమేతగా ఉపయోగపడుతుంది. ఇందుకు సంబంధించిన వివరాలను పలమనేరు వ్యవసాయశాఖ సహాయసంచాలకులు అన్నపూర్ణదేవి రైతులకు తెలియజేశారు.

పంట సాగు ఇలా.....

- సెప్టెంబర్ మొదటి వారం నుంచి ఉలవలు సాగు చేయవచ్చు
- ఎర్ర, నల్ల రేగడి నేలలు పంట సాగుకు అనుకూలంగా ఉంటాయి
- మురుగునీరు నిల్వ ఉండే నేలలు సాగు పనికి రావు
- ఉలవ పంటకాలం మాత్రం 85 నుంచి వంద రోజులు మాత్రమే
- దిగుబడి ఎకరాకు ఆరు నుంచి ఏడు క్వింటాళ్ల వరకు రావచ్చు
- విత్తనాలను చల్లే ముందు కిలో విత్తనానికి ఒక గ్రాము కార్బండజమ్‌ను కలిపి విత్తనశుద్ధి చేయాలి.
- భూమిలో తగిన తేమను చూసి నాగలితో ఒకసారి, గొర్రుతో రెండుసార్లు మెత్తగా దున్ని దుక్కిని తయారు చేయాలి.
- విత్తనాలను చల్లేలా అయితే ఎకరాకు 12–15 కిలోల విత్తనాలు అవసరముంటుంది
- ఎకరాకు నాలుగు కిలోల నత్రజని, పది కిలోల భాస్వరం, ఎనిమిది కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను విత్తే ముందు వేసుకోవాలి
- అంతర కృషిగా నాటిన నెల లోపు కలుపు నివారణ చర్యలు తీసుకోవాలి

తెగుళ్ల నివారణ, సస్యరక్షణ చర్యలు

- పూతం పిందె దశలో కాయతొలుచు పురుగు ఆశించవచ్చు
- దీని నివారణకు లీటరు నీటికి ఎండో సల్ఫాన్ రెండు మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలి
- వాతావరణంలో తేమశాతం ఎక్కువగా ఉన్నప్పుడు, రాత్రి, పగలు ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం ఎక్కువగా ఉంటే బూడిద తెగులు సోకవచ్చు.
- దీని నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము కార్బండజమ్‌ను కలిపి పిచికారీ చేయాలి
- ఉలవ సాగుకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం స్థానిక వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించవచ్చు.

ఘనంగా సోమ వారోత్సవాలు ప్రారంభం



విశేష అలంకరణలో వళ్లీదేవసేనుడు, ఎస్పీ దంపతులకు ప్రసాదాలిస్తున్న ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు

రామకుప్పం: మండల కేంద్రానికి సమీపంలోని శ్రీసుబ్రమణ్యస్వామి వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభయ్యాయి. ప్రతి ఏటా వినాయక చవితి పండుగ అనంతరం వచ్చే సోమవారం నుంచి ఐదు సోమవారాల పాటు సుబ్రమణ్యస్వామి వారోత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. తొలుత ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, విశేష అలంకరణ చేశారు.ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రాంగణంలో వళ్లీ దేవసేన సమేతుడై సుబ్రమణ్యస్వామి మయూర వాహనంపై ఊరేగారు. భక్తులు స్వామివారికి ఉత్సవాలు నిర్వహించారు. భక్తులకు ఉచిత అన్నప్రసాదాలను ఆలయ కమిటీ వితరణ చేసింది.

వళ్లీ దేవసేనుని సేవలో జిల్లా ఎస్పీ దంపతులు

సోమ వారోత్సవాల్లో జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు దంపతులు వళ్లీ దేవసేనుని దర్శించుకున్నారు. వారికి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఎస్పీ దంపతులకు స్వామివారి వస్త్రంతోపాటు ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో కుప్పం డీఎస్పీ పార్థసారథి, కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్, మండల టీడీపీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, సీతాపతి పాల్గొన్నారు.